క్లుప్తంగా

ఘనంగా సంగీత, నాట్య కళా వైభవం

- 12 గంటల నిర్విరామ సంగీత, నృత్య ప్రదర్శన



గెలుపొందిన నృత్య కళాకారులతో ఆలిండియా కళారంగ సభ్యులు

ఒంగోలు మెట్రో: ఘంటసాల వెంకటేశ్వరరావు గాత్రం, ఆయన పాటలు ప్రతి ఒక్కరి మదిలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆలిండియా కళారంగం ప్రకాశం జిల్లా గౌరవాధ్యక్షుడు మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రం కళావేదికపై ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి, పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి ఆధ్వర్యంలో ఘంటసాల వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని ప్రకాశం జిల్లా సంగీత నాట్య కళావైభవం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ తెలుగు భాష ఖ్యాతిని, తమగాత్రంతో విశ్వవ్యాప్తం చేసిన పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు సదాస్మరణీయులని అన్నారు. ఆయన పేరిట డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి పేరుతో ప్రతినెలా కార్యక్రమాలు నిర్వహించడం, గాయకులను కళాకారులను సత్కరించడం అభినందనీయమని అన్నారు. డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ మాట్లాడుతూ ఘంటసాల వర్ధంతి సందర్భంగా ప్రకాశం జిల్లా కళాకారులచే పన్నెండు గంటల పాటు సంగీత నృత్య కళా వైభవ ప్రదర్శన ఏర్పాటు చేశారని, చిన్నారులు తమ నృత్య కళా కౌశలాన్ని అద్భుతంగా ప్రదర్శించారన్నారు. గాయనీ గాయకులు ఘంటసాల గీతాలను వీనుల విందుగా ఆలపించారని అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కమల, డాక్టర్ షర్మిల, తోట శేషయ్య, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ సోమశేఖర్ పాల్గొని ఘంటసాల పాటల గురించి మాట్లాడారు. వ్యాఖ్యాతలుగా పొన్నూరు వెంకట శ్రీనివాసులు, గుర్రం కృష్ణ వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి



పోతవరం గ్రామంలో రీ సర్వేను పరిశీలిస్తున్న వరకుమార్

నాగులుప్పలపాడు: రీ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సంతనూతలపాడు నియోజకవర్గ స్పెషల్ కలెక్టర్ వరకుమార్ తెలిపారు. బుధవారం మండలంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, వీఆర్వోలకు నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించారు. అనంతరం పోతవరం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు.

వెట్టి చాకిరి విముక్తి పత్రాల పంపిణీ

కొత్తపట్నం: ఆరుగురు గిరిజన కూలీలకు వెట్టి చాకిరి విముక్తి పత్రాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం పంపిణీ చేశారు. ఎన్‌జీపాడు మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన వెంకట్రావు అనే వ్యక్తి సుబాబుల్ కర్ర కొట్టడానికి రూ.3 లక్షలను కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన వారికి ఇచ్చాడు. మల్లవరపు నరసింహారావు, మల్లవరపు మంగలమ్మ, మల్లవరపు శంకరయ్య, మల్లవరపు అంజలి, మల్లవరపు సుబ్బరాయుడు, మల్లవరపు కామాక్షి కలిసి రూ.3 లక్షల నగదు అడ్వాన్సుగా తీసుకున్నారు. కొంత కాలంగా కర్రకొట్టుడు పనిచేస్తున్నారు. వారానికి రూ.2 వేలు పనిచేస్తే వెయ్యి రూపాయలే ఇస్తున్నారని, అదేమని అడిగితే అడ్వాన్సులో జమచేస్తున్నామని చెబుతున్నారని బాధితులు ఇటీవల గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇంకా ఎంత బాకీ ఉందని, ఇంకా ఎన్నిరోజులు కష్టం చేయాలని తాము అడిగితే రూ.2 లక్షలు బాకీ ఉందని చెప్పడంతో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్.. బుధవారం ఈతముక్కలలోని వారి గృహాలకు వెళ్లి వివరాలు సేకరించారు. ఆరుగురికీ వెట్టిచాకిరి విముక్తి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గిరిజన కూలీల విషయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు, వీఆర్వో కిషోర్ ఉన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

మద్దిపాడు: మండల పరిధిలోని కొలచనకోట, మల్లవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవనశాఖ అధికారి డి.ప్రత్యూష పాల్గొని మాట్లాడుతూ వివిధ రకాల పంటలు సాగు చేసే రైతులంతా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. సొంత పొలం ఉన్న రైతులంతా విశిత నంబర్ కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ సాగర్, దామేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

- చీమకుర్తి మండలంలో జోరుగా అంతర పంటల సాగు
- కొంత ఊరట కలుగుతోందంటున్న రైతులు

అంతర పంటలపైనే ఆశలు



చీమకుర్తి రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయానికి సహాయ సహకారాలు పూర్తిగా నిలిచిపోయాయి. రైతులకు చేయూతనందించే వారు కరువయ్యారు. అన్నదాత సుఖీభవ వంటి పెట్టుబడి సాయం అందించే పథకాన్ని ఇప్పట్లో అమలు చేయలేమంటూ ఏకంగా సీఎం చంద్రబాబు చేతులెత్తేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయం చేయడం రైతన్నకు కత్తి మీద సాములా మారింది. ఒకవైపు తెగుళ్లు.. మరోవైపు క్రిమిసంహారక, సత్తువ మందుల ధరలు విపరీతంగా పెరగడంతో వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. కానీ, ఏమీ చేయలేని పరిస్థితి. రెక్కాడితేగానీ డొక్కాడని దుస్థితిలో రైతులు అరకొరగా పంటలు పండిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కూటమి ప్రభుత్వ నిర్వాకంతో అకారణంగా పంట నష్టపోతే పరిహారం అందే పరిస్థితి కూడా లేకుండా పోయింది. మందులలో సబ్సిడీ లేదు. కష్టపడి చెమటోడ్చి పండిన పంట చేతికొస్తే గిట్టుబాటు ధర ఉండటం లేదు. ఇలా అన్నివిధాలుగా సతమతమైపోతున్న రైతన్న చివరకు దళారుల వ్యవస్థకు కూడా బలైపోతున్నాడు. ఈ నేపథ్యంలో అధిక శాతం రైతులు అంతర పంటలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. వీటి వలన తమకు కొంత మేరకు ఊరట కలుగుతోందని చెబుతున్నారు.

చీమకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో అంతర పంటలు...

మండలంలోని బండ్లమూడి, పడమటి నాయుడు పాలెం, పాటిమీదపాలెం, కూనంనేనివారిపాలెం, ఇలపావులూరు, ఆర్ఎల్ పురం సచివాలయాల పరిధిలో అంతర పంటలను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. తక్కువ కాలంలో పంట చేతికొచ్చే వాటిని ఎంచుకుంటున్నారు. ఒకే టైంలో రెండో పంట కూడా వేసుకుంటూ కొంతమేర ఆదాయం పొందుతున్నారు. బండ్లమూడి గ్రామంలో బెండ తోటలో టమోటా పంటను అంతర పంటగా వేశారు. ఒకే విస్తీర్ణంలో రెండు పంటలు వేసుకోవడం వలన ఒక పంటలో రాబడి కొంతమేర తగ్గినా.. రెండో పంట బాగుంటే రైతులు నష్టాలబారిన పడకుండా ఉంటారు. ఆర్ఎల్ పురం సచివాలయం పరిధిలోని కమ్మంపాడు గ్రామంలో సవుకు తోటలో పొగాకు పంటను అంతర పంటగా వేశారు. సవుకుతోట పెరిగేందుకు నాలుగు సంవత్సరాలు పడుతుంది. దాని మధ్యలో పొగాకు పంట వేయడం వలన మూడు నెలల్లోనే ఆదాయం వస్తుంది. ఒకే విస్తీర్ణంలో రెండు పంటలు వేసుకోవడం వలన కొంత వరకు లాభాలు వస్తాయని రైతన్నలు ఆశిస్తున్నారు. ఇలపావులూరు గ్రామంలో మిరప తోటలో టమోటా, క్యాలీఫ్లవర్ పంటలను అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. వ్యవసాయాన్ని, రైతులను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోయినా అన్నదాతలు అంతర పంటల ద్వారా మొండిగా సాగుచేస్తున్నారు. వాటిపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఆరుగాలం శ్రమిస్తున్నారు.



బండ్లమూడి గ్రామంలో బెండ తోటలో అంతర పంటగా సాగుచేస్తున్న టమోటా

అంతర పంటలతో రైతన్నకు మేలు



బెండ తోటలో టమోటా అంతర పంటగా వేశా. అంతర పంటల వలన సకాలంలో పంట చేతికి రావడంతో పాటు తక్కువ సమయంలో రెండు పంటల దిగుబడులు రావడం వలన కొంతమేర రైతుకు లాభాలు వస్తాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు పంటల సాగు కష్టతరంగా మారింది. పొలం మందులు, కూలీల వ్యయం పెరిగింది.

– యాన్నం శేషురెడ్డి, మాజీ సర్పంచ్, బండ్లమూడి

అంతర పంటలైనా ఆదుకోకపోతాయా అని..



మిరప తోటలో టమోటా, క్యాలీఫ్లవర్‌ను అంతర పంటలుగా సాగు చేశా. తక్కువ కాలం పంటలు కావడంతో త్వరగా పంట చేతికొస్తే ఆ ఆదాయం ఇంకొక పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. అందుకని అంతర పంటలు వేశా.

– పులి రామారావు, ఇలపావులూరు

అంతర పంటలతో త్వరగా ఆదాయం



అంతర పంటలుగా తక్కువ కాల పరిమితి ఉన్న పంటలు వేసుకోవడం వలన రైతులకు తక్కువ సమయంలోనే ఆదాయం వస్తుంది. ఆ ఆదాయాన్ని ఇంకొక పంటలో పెట్టుబడిగా ఉపయోగిస్తే బాగుంటుంది. రైతులంతా అంతర పంటలు వేసుకోవడం వలన ఉపయోగం ఉంటుంది.

– డీవీ భాస్కర్, మండల వ్యవసాయ అధికారి, చీమకుర్తి

వధువును ఆశీర్వదించిన జెడ్పీ చైర్‌పర్సన్



వివాహ వేడుకలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి రూరల్: మండలంలోని కూనంనేనివారి పాలెం గ్రామంలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లూరి చెంచారావు కుమార్తె కోమలి వివాహానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై వధువును ఆశీర్వదించారు. పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జిల్లా జనరల్ సెక్రటరీ మన్నం శ్రీధర్, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ గంగిరెడ్డి ఓబులరెడ్డి, నల్లూరి నారాయణ, యర్రగుంట్ల వసంతరావు, మోహన్, ఏలూరి సురేష్, బొడ్డపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కాల ఒప్పంద జీవోలు ఇవ్వాలి



రెండో రోజు రిలే దీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ఒంగోలు సిటీ: సమ్మెకాల ఒప్పంద జీవోలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి టి.విజయమ్మ కోరారు. బుధవారం స్థానిక ఒంగోలు నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు రెండో రోజు రిలే దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం చూపాలని, రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రిలే దీక్షలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని గత సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాలను జీవో రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయడానికి కార్మికులతో వెట్టి చాకిరి చేయించే విధానానికి నాంది పలుకుతున్నట్లు తెలిపారు. ఆప్కాస్ వచ్చిన తర్వాత కార్మికులకు వేతనాలు ప్రతినెలా వస్తున్నాయని, పాత పద్ధతి ప్రకారం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానం అమలైతే ఆరు నెలల వేతనాలు పెండింగ్ ఉంటాయని, అది సరైన పద్ధతి కాదని అన్నారు. ఆప్కాస్ రద్దు చేసే పనయితే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.మహేష్, యూనియన్ నాయకులు యు.రత్నకుమారి, ఎం బాబు, బి.ప్రవీణ్ కుమార్, అంకరాజ్, అనిత, మరియబాబు, లాజర్, యశోద, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్



ఇంటి స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుజన్ కుమార్

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో ఇంటి నిర్మాణంలో ఉన్న స్థలాన్ని తహసీల్దార్ సుజన్ కుమార్ బుధవారం పరిశీలించారు. హౌసింగ్ లోన్ పెట్టుకుని నిర్మిస్తున్న ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన నేపథ్యంలో ఆయన ఇంటి స్థలాన్ని పరిశీలించి హద్దులు పోల్చి చూశారు. ముందుగా మండలంలోని బసవన్నపాలెం, ఇనమనమెళ్లూరు గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ రమణయ్య, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామలను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



శ్యామలను సత్కరిస్తున్న దుంపా రమణమ్మ, సంతనూతలపాడు నాయకులు



శ్యామలను కలిసి అభినందిస్తున్న మద్దిపాడు మండల నాయకులు

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామలను ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నాయకులు పలువురు కలిశారు. పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మర్యాదపూర్వకంగా శ్యామలను కలిసి సత్కరించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను శ్యామలకు రమణమ్మ వివరించారు. వరి, మిర్చి పంటలకు సంబంధించి రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని తెలిపారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని శ్యామలకు వివరించారు. రమణమ్మ వెంట పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బుడంగుంట విజయ, పార్టీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యలమందారెడ్డి, జిల్లా నాయకులు కే సుధాకర్ మాదిగ, మద్దులూరు సర్పంచ్ ఎం.శైలజ, నాయకులు వి.కోటిరెడ్డి ఎం.అమర్నాథ్, నారా విజయలక్ష్మి, ఎస్.రమణమ్మ, జి.రవి, పలువురు మహిళా నేతలు, నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు.

మద్దిపాడు నాయకుల అభినందనలు...

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఒంగోలు వచ్చిన ఆరే శ్యామలను పార్టీ మద్దిపాడు మండల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. మండలంలోని పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, గుర్రం పాతల రవి, విల్సన్, నాదెండ్ల మహేష్, పైన ప్రభాకర్, రామాంజనేయులు, నారా విజయలక్ష్మి, సన్నపురెడ్డి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుల నియామకం

చీమకుర్తి రూరల్: సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు చీమకుర్తి పట్టణానికి కూడా నూతన అధ్యక్షులను వైఎస్సార్ సీపీ అధిష్టానం నియమించింది. చీమకుర్తి మండల అధ్యక్షునిగా పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి నగర పంచాయతీ అధ్యక్షునిగా క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, సంతనూతలపాడు మండల అధ్యక్షునిగా దుంపా చెంచిరెడ్డి, నాగులుప్పలపాడు మండల అధ్యక్షునిగా పోలవరపు శ్రీమన్నారాయణ, మద్దిపాడు మండల అధ్యక్షునిగా మండవ అప్పారావును నియమించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1వ అంతస్తు,
భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

కు:
1. అరికట్ల సురేష్ బాబు, తండ్రి: వెంకయ్య, అంగిరేకులపాడు గ్రామం, లింగసముద్రం మండలం, ప్రకాశం జిల్లా – 523115, ఆంధ్రప్రదేశ్ (ఋణగ్రహీత).
2. పలిశేని వెంకటేశ్వర్లు, తండ్రి: పున్నయ్య, కనుమళ్ల గ్రామం, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా – 523101, ఆంధ్రప్రదేశ్ (హామీదారు).

డియర్ సర్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, కనుమళ్ల బ్రాంచ్ నుండి శ్రీ అరికట్ల సురేష్ బాబు, తండ్రి: వెంకయ్య, శ్రీ పలిశేని వెంకటేశ్వర్లు, తండ్రి: పున్నయ్య గారు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ప్రస్తుత తేదీ నాటికి బకాయి మొత్తం వడ్డీతో	వడ్డీ రేటు
హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 36997740000119	24.01.2011 తేదీన రూ.5,00,000/-	రూ. 14,87,297/- 31.12.2024 తేదీ నాటికి	11.10%

[illegible] 01.06.2015 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. [illegible] రూ.14,87,297/-(అక్షరాల పద్నాలుగు లక్షల ఎనభై ఏడు వేల రెండు వందల తొంభై ఏడు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, [illegible] సెక్షన్ 13(2) [illegible] సెక్షన్ 13(4) [illegible] SARFAESI [illegible] సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) [illegible]

తనఖా / తాకట్టు ఉంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

ఒంగోలు జిల్లా, సింగరాయకొండ సబ్ జిల్లా, లింగసముద్రం రెవెన్యూ మండలం, [illegible] గ్రామ పంచాయతీ, [illegible] గ్రామం, సర్వే నెం. 61/3 లోని 380.80 చ.గు. ఖాళీ స్థలం మరియు అందులోని ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ ఫ్లోర్ రెసిడెన్షియల్ బిల్డింగ్. హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం: [illegible] యొక్క స్థలం, పడమర: [illegible] యొక్క భూమి, ఉత్తరం: [illegible] యొక్క భూమి. (సింగరాయకొండ యస్.ఆర్.ఓ., రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 6350/2010, తేది 25.11.2010 ప్రకారం). [illegible]

తేది: 30.01.2025, ప్రదేశం: ఒంగోలు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

అందరికీ తెలిసేలా పథకాలు అమలు చేయాలి

- ఫంక్షనల్ కమిటీ సమావేశంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం:

ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫంక్షనల్ కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సూరారెడ్డిపాలెం–ఈతముక్కల ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సంకువారిగుంట వరకు మరమ్మతుల నిమిత్తం నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. రాజుపాలెం గ్రామంలో పశువులకు మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరారు. అన్నా ట్యాంక్ చుట్టూ రోడ్డు వెడల్పు చేసి రోడ్డు వెంట మొక్కలు నాటించాలని తీర్మానించారు. అమృత సరోవర్ పథకం ద్వారా అన్ని గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని సూచించారు. గోకుల పథకం ద్వారా 33 మందికి పనులు జరగ్గా, మిగతా 13 మందిని రిజెక్ట్ చేశారని, వాటిని ఆయా గ్రామాల్లోని అర్హులకు కేటాయించాలని చెప్పారు. కొత్తపట్నం జగనన్న కాలనీలో 350 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని, 200 మంది ఇళ్లు నిర్మించుకున్నారని, వారికి కొత్త అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించాలని వివరించారు.

నాకు తెలియజేయకుండా సమావేశాలు ఎలా పెడతారు.?

నేను అల్లూరు ఎంపీటీసీగా ఎన్నికై ఎంపీపీగా ఉన్నాను.. పంచాయతీ సమావేశాలు జరుగుతుంటే కనీసం ప్రొటోకాల్ పాటించకుండా నాకు తెలియజేయకుండా సమావేశాలు ఎలా పెడుతున్నారంటూ అల్లూరు పంచాయతీ కార్యదర్శిపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులకు తెలియకుండా నిర్ణయాలు ఏ విధంగా తీసుకుంటారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



సమావేశంలో ఫిర్యాదు చేస్తున్న గాదెపాలెం వీవోఏ గాదె దివ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు స్వాతి

గ్రామ సమైక్య అధ్యక్షురాలిని అడ్డగోలుగా నియమిస్తారా.?

గాదెపాలెం గ్రామంలో 25 పొదుపు గ్రూపులు ఉన్నాయి. 25 మంది లీడర్లు గ్రామ సమైక్య అధ్యక్షురాలిని నియమించడానికి 20/01/2025న సమావేశం నిర్వహించారు. తీర్మానం పుస్తకంపై ఏమీ రాయకుండా సభ్యులతో సంతకాలు పెట్టించుకున్నారు. ఆ పుస్తకాన్ని ఏపీఎం ఇంటికి తీసుకెళ్లి తనకు ఇష్టమొచ్చిన అధ్యక్షురాలి పేరు రాసుకున్నారు. సభ్యులు నగదు చెల్లించడానికి బ్యాంకుకు వెళితే కమిటీ మారిందని, మీ సంతకం చెల్లదని చెప్పడంతో అవాకయ్యారు. బుధవారం జరిగిన ఫంక్షనల్ కమిటీ సమావేశంలో వీవోఏ గాదె దివ్యలక్ష్మి, ఆలూరు ఎంపీటీసీ సభ్యురాలు ఆరుమూళ్ల స్వాతి దీనిపై ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీవో శ్రీకృష్ణ, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఎంపీటీసీలు, పంచాయతీ సర్పంచ్‌లు ఈ నెల 15న మరోసారి సమావేశం ఏర్పాటు చేసి అధ్యక్షురాలిని, కమిటీ సభ్యులను నియమిస్తామని చెప్పారు. సమావేశంలో ఏఓ శ్రీనివాసులు, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రామలింగం వెంకట్రావు, మిట్నసల శాంతారావు, పిన్ని నరసింహారావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కృష్ణారెడ్డి, ఎంఈవో పద్మావతి, అనూషా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు



మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు

ఒంగోలు మెట్రో: గోవింద మాల భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు వద్ద గల గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కళ్యాణ వేదికపై రమా వసుంధర సమేత సత్యనారాయణస్వామితో పాటు లక్ష్మీనరసింహస్వామిని ప్రతిష్ఠించి అధిక సంఖ్యలో తరలివచ్చిన దంపతులతో వ్రతం చేయించారు. లక్ష్మీనరసింహస్వామికి లఘు కళ్యాణాన్ని నేత్రపర్వంగా జరిపించారు.



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

దివ్యాంగుల సంక్షేమం కోసం ఇంటింటి ప్రచారం

సంతనూతలపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని దివ్యాంగుల సంక్షేమం కోసం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు జిల్లా లోక్ అదాలత్ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ డాక్టర్ నూకతోటి రవికుమార్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి, స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలో 15 రోజుల పాటు దివ్యాంగుల సంక్షేమం కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా పేర్నమిట్ట గ్రామంలోని పలు ప్రాంతాలలో పరిసరాల పరిశుభ్రత, బాల్యవివాహాలతో అనర్థాల గురించి వివరించారు. ఏరుగంటి మణిశంకర్ అనే దివ్యాంగ బాలుడిని, అతని తల్లిని పరామర్శించి దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉపకార వేతనాల గురించి వివరించారు. న్యాయసేవాధికార సంస్థ పారాలీగల్ వలంటీర్ పాటిబండ్ల సతీష్, స్థానిక అంగన్వాడీ టీచర్ దోర్నాదుల కామేశ్వరి, పలువురు తల్లులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనలు కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఒంగోలు డివిజన్

90102 24456, 90103 57744
90102 02762

Office mail : sakshiongads@gmail.com